# యాతాలకుంట టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు అందించడమే లక్ష్యం
- రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 21,(ప్రజా జ్యోతి)** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 22 | సెప్టెంబర్ | 2026 • పేజీలు : 6




# ఎస్సీ, ఎస్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- ఎస్సీ ,ఎస్టీ ప్రజలను_ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు
- భద్రగిరి మార్ట్ ఆదర్శనీయం
- ఐటిడిఏ పిఓ రాహుల్ ను అభినందించిన కమిషన్ చైర్మన్
- బాధితుల సమస్యలను పరిశీలించి అధికారులకు ఎండార్స్ చేసిన కమిషన్ చైర్మన్

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 21,(ప్రజా జ్యోతి)** ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తూ, రక్షణ చట్టాలను రూపొందించిందని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం భద్రాద్రి జిల్లా ఐ.డీ.ఓ.సీ లో ల్యాండ్, సర్వీస్( ఆర్.ఓ.ఆర్), అట్రాసిటీస్ అంశాలపై అధికారులతో , ముగ్గురు కమీషన్ సభ్యులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు, రాష్ట్రంలోనే అతి పెద్ద ఏజెన్సీ జిల్లా భద్రాద్రి జిల్లా అని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీల అభివృద్ధి కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీల భూమి సమస్యలు, బ్యాక్ లాగ్ పోస్టులు వివరాలు, ఉద్యోగులు రక్షణ కోసం చట్టాలను, రోస్టర్ విధానాలు, రూపొందించి వాటిని అమలు చేసేందుకు కమిషన్ చర్యలు చేపడుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల పైన ఉద్యోగులపైన ఎటువంటి వేధింపులు కానీ చిత్రహింసలు గాని ఇబ్బందులు గురి చేసిన శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మన్ హెచ్చరించారు. న్యాయం కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ బాధితులకు ఎఫ్.ఐ.ఆర్, చార్జిషీట్ ,కమిషన్, కంపన్సేషన్

మిగతా 6 లో...



# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్&ఆర్ పనులను వేగవంతం చేయాలి

**రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 21,(ప్రజా జ్యోతి)** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం–పునరావాస పునరుద్ధరణ (ఆర్&ఆర్) పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్&ఆర్ పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయం నుంచి భద్రాచలం

మిగతా 2 లో...

# అక్టోబర్ 25 లోపు (ఎస్ ఐ ఆర్) అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి

- ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 21,(ప్రజా జ్యోతి)** ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశించిన గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 కార్యక్రమంపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఐ డి ఓసీ కార్యాలయ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్టతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తుల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని

మిగతా 2 లో...

# పోడు భూముల రైతులకు అండ...

- అటవీ అధికారులతో ఎమ్మెల్యే పాయం చర్చలు...
- జిల్లా డీఎఫ్ఓ ఆఫీస్ లో కీలక భేటీ...
- పోడు భూముల పెండింగ్ సమస్యలపై హామీ...
- పోడు రైతులకు న్యాయం చేస్తా...
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 21, ప్రజాజ్యోతి :** పోడు భూముల రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటానని, గిరిజన సమస్యలు తీర్చడానికి ముందు ఉంటానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం లోని డీఎఫ్ఓ కార్యాలయంలో అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఉప అటవీ సంరక్షణ అధికారి బాబు, నిషా తదితర అధికారులతో కలిసి పోడు భూముల సమస్య లను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ

మిగతా 2 లో...

## పోడు భూముల రైతులకు అండ...



(మొదటి పేజీ తరువాయి...)

నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో పోడు భూములపైనే ఆధారపడి జీవిస్తున్న గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పోడు భూములపై హక్కులు, అటవీ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి గిరిజన రైతుకు ప్రభుత్వం తరపున న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పినపాక నియోజకవర్గ గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని అటవీ శాఖ అధికారులు హామీ ఇచ్చారు.

## అక్టోబర్ 25 లోపు (ఎస్ ఐ ఆర్) అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)

వాటిని వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని, ప్రతి బీఎల్‌ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి వారి పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. అనామలీస్, ఇతర మ్యాపింగ్ కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, విచారణ, పరిష్కార ప్రక్రియలను అక్టోబర్ చివరి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్–2026కు సంబంధించిన అన్ని ప్రక్రియలను అక్టోబర్ 25లోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను అవసరమైన సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని తెలిపారు. ఫారం–6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్లు ఫారం–6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్‌ఓలు మాత్రమే పంపిణీ చేయాలని, బీఎల్‌ఏలను నోటీసుల పంపిణీలో భాగస్వాములను చేయరాదని స్పష్టం చేశారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరపున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్–2026లో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. బీఎల్‌ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. అక్టోబర్ 25 గడువును దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని, చివరి దశలో పనులు పేరుకుపోకుండా ప్రతి రోజూ పురోగతిని సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఈఆర్‌ఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యాతాలకుంట టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి, టన్నెల్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింది భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్‌తో పటిష్ఠంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. టన్నెల్ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. టన్నెల్‌కు సంబంధించిన మిగిలిన పనులను 25 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబర్ నెలలో టర్నల్ పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర మిగిలిన పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ములకలపల్లి మండలం కుమ్మరిపాడు గ్రామంలో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులతో 4 కోట్ల 63 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడంతో పాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. అనంతరం ములకలపల్లి మండలం కమలాపురం గ్రామంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని మూడో పంప్‌హౌస్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తో కలిసి పరిశీలించి, మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. పంప్‌హౌస్ నుంచి విడుదలైన నీటి ప్రవాహాన్ని పరిశీలించి, నీటి విడుదలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి నీటిని అందించే దిశగా ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. యాతాలకుంట వద్ద టన్నెల్ పనులను పరిశీలించి, మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. టన్నెల్‌లో కొన్ని ప్రాంతాల్లో కింది భాగంలో ఖాళీలు ఉండటంతో వాటిని కాంక్రీట్‌తో పూర్తి స్థాయిలో ప్యాకింగ్ చేసి పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబర్‌లో సీతారామ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. భూసేకరణ కోసం ఇటీవల రూ.48 కోట్లు విడుదల చేశామని, ఇంకా అవసరమైన భూముల కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపితే అవసరమైన నిధులను కూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు, ప్రస్తుతం రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా ఉండటం, ఎల్‌నినో ప్రభావం వంటి కారణాలతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని మంత్రి అన్నారు. వర్షాలు సకాలంలో లేకపోవడం వల్ల భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటలను కాపా




డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో నీటిని అందించేందుకు గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో కూడా సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు జరుగుతున్నందున సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు 80 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉన్న ప్రాంతాలకు నీటి లభ్యతను పెంచే విధంగా సీతారామ జలాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు పనులపై జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు వారానికోసారి సమీక్ష నిర్వహించాలని మంత్రి సూచించారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఎక్కడా పనులు నిలిచిపోకూడదని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే జిల్లా స్థాయిలో పరిష్కరించాలని అన్నారు. అవసరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ములకలపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రహదారులు, మండల కార్యాలయాలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి విమానాశ్రయం, రైల్వే అనుసంధానం వంటి మౌలిక వసతులు అవసరమని మంత్రి తెలిపారు. విమానాశ్రయానికి సంబంధించి సాధ్యాసాధ్యాల నివేదిక సిద్ధమైన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. రైల్వే అనుసంధానానికి సంబంధించి పాండురంగాపురం–మణుగూరు మార్గం, భద్రాచలం వైపు రైల్వే విస్తరణ అంశాలపై కూడా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలోని వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని, వర్షాలపై మాత్రమే ఆధారపడే పరిస్థితి తగ్గి సాగుకు నీటి భరోసా పెరుగుతుందని మంత్రి అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్&ఆర్ పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్&ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులతో పాటు ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ కోసం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, తాజాగా మరో రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విడుదలైన నిధుల్లో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని అన్నారు. భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను కలెక్టర్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. నిధుల కొరత లేదా ఇతర కారణాలతో పరిహారం చెల్లింపులు నిలిచిపోతే సంబంధిత వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేయాలని మంత్రి సూచించారు. ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా




ఉందని తెలిపారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా అవసరమైన భూసేకరణను ప్రాధాన్యతతో చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్&ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,101 కోట్ల విలువైన పనులను గుర్తించగా, రూ.2,504 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల డంప్ గుర్తింపు

- ఆయుధాలు, మందు గుండు సామగ్రి స్వాధీనం



**చర్ల , సెప్టెంబర్ 21:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా భైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉట్లా గ్రామ అటవీ ప్రాంతంలో భూమిలో పాతిపెట్టిన నక్సల్ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన నక్సలైట్ల నుంచి సేకరించిన సమాచారంతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.బీజాపూర్ ఎస్పీ ఉమేష్ ప్రసాద్ గుప్తా (ఐపీఎస్) ఆదేశాల మేరకు జిల్లాలో లొంగిపోయిన నక్సలైట్లపై నిరంతర నిఘా కొనసాగిస్తూ మావోయిస్టు కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు . ఇందులో భాగంగా భైరామ్‌గఢ్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో ఎస్‌డీఓపీ నవీన్ ఎక్కా పర్యవేక్షణలో ప్రత్యేక బలగాలను ఉట్లా గ్రామ అటవీ ప్రాంతానికి పంపించారు.అక్కడ భద్రతా నిబంధనలు పాటిస్తూ గాలింపు చేపట్టిన పోలీసులు భూమిలో పాతిపెట్టిన నక్సల్ డంప్‌ను గుర్తించారు. డంప్ నుంచి ఒక ఏకే–47 రైఫిల్, ఒక 315 బోర్ రైఫిల్, ఒక సింగిల్ షాట్ రైఫిల్, ఒక 9 ఎంఎం పిస్టల్, రెండు ఏకే–47 మ్యాగజైన్లు, 45 ఏకే–47 లైవ్ రౌండ్లు, 25 తొమ్మిది ఎంఎం లైవ్ రౌండ్లు, ఆరు 315 బోర్ రైఫిల్ లైవ్ రౌండ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, మందుగుండు సామగ్రిని భైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్టపరమైన చర్యలు చేపట్టారు . ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఉమేష్ ప్రసాద్ గుప్తా అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి చర్యలను కొనసాగించాలని సూచించారు.ఈ ఆపరేషన్‌లో భైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గిరీష్ తివారీ, ట్రైనీ ఎస్ఐ వినయ్ నాయక్, ఎస్ఐ రామ్‌లాల్ నేతమ్, హెడ్ కానిస్టేబుళ్లు అజయ్ బఘేల్, రామ్‌లాల్ యాదవ్, నరేష్, రామారామ్ హప్కా, రాజు కడ్తి, కానిస్టేబుళ్లు భరత్ మండీఘ, భీమ్‌సేన్ వెక్కో, ధానురామ్, డీఎస్ఎఫ్ కానిస్టేబుళ్లు బల్దేవ్ మాతమ్, రాము హేమ్లా, మంకు హప్కా తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగాలు.. ఉపాధి అవకాశాలు కల్పించాలి

- ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి: డీవైఎఫ్ఐ



**పినపాక, సెప్టెంబర్ 21(ప్రజాజ్యోతి)** యువత భవిష్యత్తుతో చెలగాటమాడకుండా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ, జిల్లా అధ్యక్షుడు లిక్కీ బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం పినపాక మండలం ఈ.బయ్యారంలో నిర్వహించిన యువజన మహాసభలో వారు మాట్లాడారు. దేశానికి యువశక్తి అతిపెద్ద బలమని చెప్పే పాలకులు.. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంలో తగిన చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. “చదువు పూర్తయింది.. ఉద్యోగం ఎక్కడ? అర్హత ఉంది.. నియామకం ఎక్కడ? నైపుణ్యం ఉంది.. అవకాశం ఎక్కడ? ఖాళీ పోస్టులు ఉన్నాయి.. భర్తీ ఎప్పుడు?” అంటూ ప్రభుత్వాలను యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యా అవకాశాలను పెంచడంతో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. యువతను కులం, మతం, ప్రాంతం పేరుతో విభజించే రాజకీయాలకు దూరంగా ఉండి.. తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని నాయకులు సూచించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ విద్య, ఉద్యోగం, ఉపాధి, సామాజిక న్యాయం కోసం యువత చైతన్యంతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాను ప్రజా సమస్యలపై అవగాహన కల్పించేందుకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత హక్కుల పరిరక్షణతో పాటు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సాధన కోసం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని హరికృష్ణ, బాలరాజు తెలిపారు. ఈ మహాసభలో యువజన సంఘం నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నాం: ఎమ్మెల్యే పాయం

- 30 మందికి ఇళ్ల పట్టాలు..
- రూ.7.80 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి):** పేదల సంక్షేమం,అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బూర్గంపహాడ్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముసలమడుగు పంచాయతీ పరిధిలోని చెరువు సింగారం గ్రామానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తూ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద,మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల ఎంతో ముఖ్యమైందని,ఆ కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం వివిధ అనారోగ్య కారణాలతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన రూ.7.80 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనారోగ్యంతో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పేదలకు సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో ఎంపీఓ రామకృష్ణ,హౌసింగ్ ఏఈ ఉదయ్,పీఆర్ ఏఈ చక్రధర చారి,మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి,సర్పంచులు పూనెం సురేంద్ర,మందా నాగరాజు,బాదం వెంకటేశ్వర్ రెడ్డి,బానోత్ పద్మ, ఉప సర్పంచులు గుండె వెంకన్న,భూక్య మోహన్ రావు,భజన ప్రసాద్,కాంగ్రెస్ నాయకులు,అధికారులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ దరఖాస్తుదారుల విచారణ పారదర్శంగా నిర్వహించాలి

**ఇల్లందు, సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి )** రాష్ట్ర ప్రభుత్వం అందజేసే పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి విచారణ పారదర్శకంగా నిర్వహించాలని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య కోరారు. సోమవారం 13వ వార్డులో పెన్షన్ల దరఖాస్తుల విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దండు సారయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పెన్షన్ అందజేయడం జరుగుతుందన్నారు. అనర్హులను గుర్తించి అర్హులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. విచారణ పూర్తయిన అనంతరం కాలయాపన చేయకుండా త్వరితగతిన అర్హులైన వారందరికీ పెన్షన్లను అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## వయో వృద్ధుల సాధికారిత రాష్ట్ర పురస్కారాలు 2026 కోసం దరఖాస్తుల స్వీకరణ


**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 21,(ప్రజా జ్యోతి)** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం అక్టోబర్1, 2026 సందర్భంగా దివ్యాంగుల, వయోవృద్ధుల ట్రాన్స్ జెండర్స్ పర్సన్స్ సాధికారత శాఖ డైరెక్టర్ హైదరాబాద్ వారి ఆదేశానుసారం వయో వృద్ధుల సాధికారత కోసం సేవలందిస్తున్న అర్హులైన వ్యక్తులు, లేదా సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీన సోమవారం తెలిపారు ,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే వారు(ఏ)కేటగిరి నందు వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన సీనియర్ సిటిజన్లు వయసు పైబడినప్పటికీ, ఈ క్రింది రంగాలలో గణనీయమైన, చెప్పుకోదగిన కృషి చేసిన సీనియర్ సిటిజన్లు, సామాజిక సేవ ,సమాజ అభివృద్ధి,విద్య,వైద్య , ఆరోగ్య సేవలు, కళలు, సాహిత్యం , సంస్కృతి,క్రీడలు , ఆటలు,వ్యవసాయం , అనుబంధ కార్యకలాపాలు, సైన్స్,టెక్నాలజీ ఇన్నోవేషన్,పబ్లిక్ సర్వీస్, పర్యావరణం , సమాజ సంక్షేమం. బి :వయోవృద్ధుల సంక్షేమం కోసం అసాధారణమైన సేవలను అందిస్తున్న వ్యక్తులు,నిరంతర సహకారం అందించిన వ్యక్తులు:వయోవృద్ధుల రక్షణ, సంక్షేమం,వయోవృద్ధుల శారీరక, మానసిక , సామాజిక శ్రేయస్సును ప్రోత్సహించడం, వయోవృద్ధుల జీవన నాణ్యతలో గణనీయమైన మెరుగుదలకు దారితీసే మరేదైనా కార్యాచరణ సంస్థాగత వర్గం వయోవృద్ధులకు అసాధారణమైన సేవలను అందిస్తున్న సంస్థలు/సంఘాలు/స్వచ్ఛంద సంస్థలు, వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, రక్షణ , సాధికారత కోసం నిరంతర, వినూత్న , ఆదర్శప్రాయమైన సేవలను అందిస్తున్న సంస్థలు, వయోవృద్ధుల సంఘాలు, ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు లేదా ఇతర సంస్థలు. పైన పేర్కొనబడిన కేటగిరీల వారిగా దరఖాస్తు చేసుకోవచ్చని, మార్గదర్శకాల కొరకు www.wdsc.telangana.gov.in వెబ్ సైట్ సందర్శించగలరనీ తెలిపారు, దరఖాస్తుదారుడు పూర్తి చేసిన దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలు జతపరిచి చిరునామా–సంచాలకుల కార్యాలయం, దివ్యాంగుల, వయోవృద్ధుల ,ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారిత శాఖ, గ్రౌండ్ ఫ్లోర్, దివ్యాంగుల సంక్షేమ భవన్, నల్గొండ ఎక్స్ రోడ్, మలక్ పేట్, హైదరాబాద్. పిన్ కోడ్:500036 నకు సెప్టెంబర్ 26, 2026 సాయంత్రం 5:00 గంటలలోపు హార్డ్ కాపీని సమర్పించాలి. వివరాల కొరకు 6301981960, 8331006010 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## పెదవాగు పీహెచ్ సీకి డాక్టర్ కరువు.

- వర్షాకాలంలో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు
- వైద్యాధికారి లేక సిబ్బందిపైనే భారం
- అత్యవసర కేసులపై ప్రజల్లో ఆందోళన



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 21 ప్రజా జ్యోతి** మండలం పెదవాగు ప్రాజెక్టు ప్రాం తంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి అందుబాటులో లేకపోవడం తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజులుగా వైద్యాధికారి లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు కిందిస్థాయి సిబ్బందే



వైద్య సేవలు అందిస్తున్న పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. వర్షా కాలం కావడంతో జ్వరాలు, దగ్గు, జలుబు, చర్మ సంబంధిత సమస్యలతో రో గులు ఆసుపత్రికి వస్తున్నారు. ఈ సమయంలో పూర్తిస్థాయి వైద్యుడు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారిందని ప్రజలు అంటున్నారు. సాధారణ కే సులకు కొంత మేర సేవలు అందుతున్నా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వై ద్యం ఎవరు అందిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గ్రామీణ, గిరిజన ప్రాంతా ల ప్రజలకు ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కీలకంగా ఉంది. వైద్యాధికారి లేకపోవడంతో అత్యవసర రోగులను ఇతర ఆసుపత్రులకు తరలించాల్సి వస్తే సమ యం వృథా కావడంతో పాటు ఆర్థిక భారం పెరుగుతుందని స్థానికులు పే ర్కొంటున్నారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.జిల్లా వైద్యాధికారులు, కలెక్టర్, ఐటీడీఏ అధికారులు సమస్యపై దృష్టిసారించి పీహెచ్ సీని తనిఖీ చేయాలని, వైద్యాధికారిని వెంటనే నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సైతం స్పందించి గ్రామీణ ప్రాంత ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కరూర్ వైశ్యా బ్యాంక్ చేయూత

- సి ఎస్ ఆర్ నిధులతో రూ.5.63 లక్షల విలువైన 25 లెనోవో ట్యాబ్‌ల ను కలెక్టర్కు అందజేత
- విద్యా సాంకేతిక అభివృద్ధికి కార్పొరేటర్ల సహకారం అభినందనీయం
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 21,(ప్రజా జ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి తోడ్పాటులో భాగంగా కరూర్ వైశ్య బ్యాంక్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్) నిధుల కింద రూ.5,63,509 విలువైన 25 లెనోవో ట్యాబ్‌లను జిల్లా కలెక్టర్ అంకిత్‌కు బ్యాంక్ అధికారులు సోమవారం అందజేశారు.విద్యార్థులకు డిజిటల్ వనరులను అందుబాటులోకి తీసుకురావడం, విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ట్యాబ్‌లను అందించినట్లు బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న కరూర్ వైశ్య బ్యాంక్ యాజమాన్యానికి కలెక్టర్ అంకిత్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ విద్య, ఆరోగ్యం తదితర ప్రజోపయోగ కార్యక్రమాలకు కార్పొరేట్ సంస్థలు తమ సి ఎస్ ఆర్ ద్వారా సహకరించాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో కరూర్ వైశ్య బ్యాంక్ తెలంగాణ నార్త్ డివిజనల్ హెడ్ కిషోర్ వర్మ యు వి కె చీఫ్ మేనేజర్ బాలాజీ నడిపల్లి, కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ ఎస్. సురేష్, మేనేజర్ ఎం.డి. ఖుద్దూస్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జె. సునీత తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తికి కొత్తగూడెంలో అర్ధరాత్రి అరుదైన అత్యవసర శాస్త్ర చికిత్స





**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 21 ,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం ప్రభుత్వ సర్వజన వైద్యశాల జి జి హెచ్ ) లోో పదునైన వస్తువుతో దాడికి గురైన 45 సం వత్సరాల వ్యక్తికి వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. వివరాలలోకి వెళ్తే శనివారం అర్ధరాత్రి తీవ్ర గాయాలతో క్యాజువాలిటీకి వచ్చిన రోగికి ముఖం, మెడ, కుడి చెవి ప్రాంతాల్లో లోతైన గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే అత్యవసర వైద్య సేవలు ప్రారంభించి, సీనియర్ రెసిడెంట్ డా. ఫరూక్ స్టాఫ్ నర్సుల సహకారంతో లోకల్ అనస్తీషియా కింద గాయాలకు కుట్లు వేయడంతో పాటు కుడి చెవికి చికిత్స చేశారు. డా. రమేష్, అనస్థీషియా విభాగం, శస్త్రచికిత్సతో పాటు శస్త్రచికిత్స అనంతర క్రిటికల్ కేర్ మేనేజ్‌మెంట్‌లో కీలకంగా పాల్గొన్నారు.చీఫ్ సర్జన్, జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రాంప్రకాష్ చిటిమళ్ల పర్యవేక్షణలో వైద్య బృందం సమన్వయంతో అత్యవసర చికిత్స అందించారు, ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్యులు, అనస్థీషియా విభాగం, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాధామోహన్ అభినందించారు.అత్యవసర పరిస్థితుల్లో ఇలాంటి క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు, క్రిటికల్ కేర్ మేనేజ్‌మెంట్ సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన వైద్య వసతులు, సేవలను బలోపేతం చేయడంలో సహకరిస్తున్న జిల్లా కలెక్టర్ అంకిత్‌కు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కు చెందిన వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగే సుప్రీమా?

- అవుట్సోర్సింగ్ ఉద్యోగి వస్తేనే రిజిస్ట్రేషన్లు.. లేకుంటే రైతులకు ఎదురుచూపులే!
- ప్రమాదానికి గురైన ఉద్యోగి స్థానంలో ప్రత్యామ్నాయ సిబ్బంది ఎందుకు లేరు?



**అశ్వారావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 21** అశ్వారావు పేట రెవెన్యూ కార్యాలయంలో కీలకమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అందుబాటులో ఉండటంపైనే ఆధారపడుతున్న పరిస్థితి నెలకొన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత ఉద్యోగి ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయిందని రైతులు వాపోతున్నారు.ఒక ఉద్యోగి సెలవులో ఉన్నా, అనారోగ్యానికి గురైనా లేదా ప్రమాదానికి గురైనా ప్రభుత్వ సేవలు పూర్తిగా నిలిచిపోకుండా ప్ర త్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బా ధ్యత అధికారులపై ఉంటుంది. అయి తే ఇక్కడ మాత్రం సంబంధిత ఉద్యోగి తిరిగి విధులకు హాజరయ్యే వరకు రిజిస్ట్రేషన్లు జరగవన్న పరిస్థితి ఎందుకు ఏర్పడిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఉద్యోగి లేకపోతే సేవలు బంద్?

రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వస్తున్న రైతులు రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమి కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ కోసం ఎదురుచూస్తుండగా, భూమిని అమ్ముకున్న వారికి కూడా లావాదేవీ పూర్తికాక ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు.ఒక వ్యక్తిపై ఆధారపడే విధంగా ప్రభుత్వ సేవల వ్యవస్థ నడవడం ఎంతవరకు సమంజసం? సంబంధిత ఉద్యోగి విధులకు హాజరుకాలేని పరిస్థితి ముందుగానే తెలిసినా ప్రత్యామ్నాయ సిబ్బందిని ఎందుకు ఏర్పాటు చేయలేదన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.కొనుగోలుదారుడి రోదన.. అమ్మకందారుడి ఆవేదనరిజిస్ట్రేషన్ పూర్తికాకపోవడంతో ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్న కొనుగోలుదారులు, అమ్మకందారులు ఇబ్బందులు పడుతున్నారని రైతులు చెబుతున్నారు. డబ్బులు చెల్లింపులు, రుణాలు, ఇతర ఆర్థిక వ్యవహారాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియతో ముడిపడి ఉండటంతో ఆలస్యం వల్ల అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తమవుతోంది.ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అందుబాటులో లేకపోతే ప్రభుత్వ సేవ ఆగిపోవాల్సిందేనా? ఆపరేటర్ గా పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగికి ఇంత కీలక బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సమంజసం గతంలో ఇలాగే ఆపరేటర్ కు రిజిస్ట్రేషన్ బాధ్యతలు మరియు ఎమ్మార్వో దగ్గర ఉండాల్సిన కీ ని కూడా ఆ అవుట్సోర్సింగ్ ఉద్యోగి ఇస్తే ఇన్ని రకాల ఇబ్బందులు పడ్డాము చూసినా కానీ ప్రభుత్వ ఉద్యోగిని మాత్రం నియమించలేదు అంటే ఇక్కడున్న అధికారులు కూడా అవినీతిలో భాగం అవ్వాలని అనుకుంటున్నారా లేక ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నారా అర్థం కాని ప్రశ్న గా మిగిలిపోతుంది అని ప్రజలుగుసగుసలాడుకుంటున్నారు .ప్రజలకు సేవలందించేందుకు ఏర్పాటు చేసిన కార్యాలయంలో ప్రత్యామ్నాయ వ్యవస్థ లేకపోవడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

## మల్లికార్జున స్వామి ఆలయంలో విశేష పూజలు

- భక్తిశ్రద్ధలతో అభిషేకాలు.. అనంతరం అన్నదానం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 21, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో సోమవారం విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



## మెరుగైన విద్యా ప్రమాణాలు పాటించాలి

- ఎమ్మెల్యే జారే





**ములకలపల్లి, సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి):** నేను సైతం – చేయూత' కార్యక్రమంలో భాగంగా 'విద్యాయాత్ర – మన ఎమ్మెల్యే.. మన బడి' కార్యక్రమాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం రాచన్నగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాచన్నగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, తరగతి గదుల నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలో తాగునీరు, వంటశాల, మౌలిక వసతులు, పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్య, అవసరమైన సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అటవీ-రెవెన్యూ అధికారులు కలిసి భూ సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 21, (ప్రజా జ్యోతి)**

కొత్తగూడెం జిల్లాలో అటవీ _ రెవెన్యూ శాఖ అధికారులు కలిసి భూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు, సోమవారం స్థానిక ఐడిఓసి కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూఅటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయంతో భూ సమస్యలను పరిష్కరించాలని, కార్యాలయాల మధ్య లేఖల మార్పిడికే పరిమితం కాకుండా సంబంధిత అధికారులు సంయుక్తంగా పర్యటించి రికార్డులు, వాస్తవ పరిస్థితులను పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. జాయింట్ సర్వేలను నిర్దిష్టగడువులో పూర్తి చేసి స్పష్టమైన సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పాపకొల్లు గ్రామంలోని అటవీ, ప్రభుత్వ, పట్టా భూముల సరిహద్దులు, పాత రికార్డులకు సంబంధించిన భూ వివాదాన్ని సమావేశంలో సమీక్షించారు. పాత ఖాస్రా పహాణీ, రెవెన్యూ రికార్డులు, ప్రస్తుత రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. సర్వే నంబర్ 90తో పాటు ఇతర పెండింగ్ సర్వేలను కూడా పూర్తి చేయాలని సూచించారు. అశ్వాపురం పరిధిలోని తుమ్మలచెరువు, మామిళ్లగూడెం ప్రాంతాల్లో అటవీ సరిహద్దుకు వెలుపల ఉన్న భూములకు సంబంధించిన లబ్ధిదారుల దరఖాస్తులు, పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ ప్రక్రియపై సమీక్షించారు. అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎండోమెంట్స్ భూముల సరిహద్దుల నిర్ధారణ, ఆక్రమణలకు సంబంధించిన అంశాలపై చర్చించారు, సంబంధిత భూములను గుర్తించి బౌండరీ ఫిక్సేషన్ పూర్తి చేయడానికి సర్వేయర్లను మోహరించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. హైదరాబాద్–భద్రాచలం జాతీయ రహదారి ఎన్ హెచ్-930 పి విస్తరణకు సంబంధించిన అటవీ భూముల మళ్లింపు, ప్రత్యామ్నాయ అటవీకరణ భూముల గుర్తింపు అంశాలను సమీక్షించారు. ప్రతిపాదిత సి ఎ భూములకు అవసరమైన రహదారి సౌకర్యం, భూ రికార్డులు, నాన్-ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లను సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. సీతమ్మ సాగర్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన అటవీ భూముల మళ్లింపు ప్రతిపాదనల్లో ఉన్న అభ్యంతరాలు, సి ఎ భూములకు సంబంధించిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. పాత ప్రాజెక్టులకు సంబంధించిన కంప్లయన్స్‌ను పూర్తి చేసి అనుమతుల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా వెట్‌ల్యాండ్స్ గుర్తింపు, సంరక్షణపై కూడా కలెక్టర్ సమీక్షించారు ,నీటి వనరులకు డిజిపిఎస్ సర్వే, హద్దుల నిర్ధారణను వేగవంతం చేసి అర్హత ఉన్న ప్రాంతాల్లో వెట్‌ల్యాండ్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను పొందే విధంగా ప్రతిపాదనలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలవరం బ్యాక్‌వాటర్స్, పులుసుబొంత ప్రాజెక్టు, సింగరేణి సి ఎ భూములకు సంబంధించిన అంశాల నో ప్రస్తావించగా వివిధ శాఖలకు గతంలో కేటాయించిన సి ఎ భూముల వివరాలను సమగ్రంగా సేకరించి క్రాస్ వెరిఫికేషన్ చేయాలని, రైతుల అభ్యంతరాలు ఉన్న ప్రాంతాల్లో రికార్డులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. భూ సర్వేలు, అటవీ–రెవెన్యూ సరిహద్దులు, పెండింగ్ భూ వివాదాల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటిడిఏ పిఓ రాహుల్ ,భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ,జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రం సింగ్ ,వివిధ మండలాలకు చెందిన తాసిల్దారులు, సర్వేయర్లు పాల్గొన్నారు

# వేడుకగా కుంకుమ పూజా కార్యక్రమం

- గణనాథుని సన్నిధిలో మహిళల ప్రత్యేక పూజలు



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 21, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల పెంట్లం గ్రామంలోని గౌడ బజార్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమ పూజలో పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పూజా ప్రాంగణం సందడిగా మారింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



**ఇల్లందు, సెప్టెంబర్ 21 (ప్రజా జ్యోతి)** విద్యార్థులు చెడు అలవాటులకు దూరంగా ఉంటూ, భవిష్యత్ కు బంగారు బాటలు వేసుకోవాలని ఇల్లందు ఎస్సై ఉమా అన్నారు. ఇల్లందులోని మాంటిస్సోరి ప్రైమ్, సీబీఎస్ఈ స్కూల్‌లో డ్రగ్స్ వినియోగం, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల ఎన్నో అనర్థాలు, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ వినియోగం వైపు ప్రోత్సహిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. చదువుపైనే దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సారంగపాణి, పాఠశాల ప్రిన్సిపల్ నిషా జోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే జారే

- జగన్నాథపురంలో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



**ములకలపల్లి, సెప్టెంబర్ 21(ప్రజాజ్యోతి):** మండలంలోని జగన్నాథపురంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువుదీరిన శ్రీ మహా గణనాథుడిని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం దర్శించుకున్నారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. తులసీదళాల అలంకరణలో, వేద మంత్రోచ్చారణల నడుమ కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలపై గణనాథుడి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, నియోజకవర్గ ప్రజలకు అడుగడుగునా శుభం కలగాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# పువ్వాడ అజయ్ చేయూతతో గిరిజనుడికి ఉచిత వైద్యం

- ఇంటికి వెళ్లి పరామర్శించిన వేముల హరీష్, ఐలూరి కృష్ణారెడ్డి



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 21, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని పెంట్లం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజనుడు మడివి నాగేశ్వరరావుకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సహకారంతో మమత ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేయించారు. కొంతకాలంగా కాలికి తీవ్ర గాయంతో నడవలేని పరిస్థితిలో ఉన్న నాగేశ్వరరావు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేకపోయారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు వేముల హరీష్ తదితరులు పువ్వాడ అజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఉచితంగా శస్త్ర చికిత్సతో పాటు కోలుకునే వరకు వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించినట్లు తెలిపారు. పది రోజుల చికిత్స అనంతరం నాగేశ్వరరావు సోమవారం డిశ్చార్జి అయి ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వేముల హరీష్, మాజీ ఎంపీటీసీ ఐలూరి కృష్ణారెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. పువ్వాడ అజయ్ కుమార్ ఫోన్ లో ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు పువ్వాడ అజయ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కారం శివ, వార్డు సభ్యురాలు మహాలక్ష్మి , నాయకులు తేజావత్ శివ, ఇటుకల హరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

- మండలంలో విస్తృత పర్యటన.. పలు మండపాల్లో ప్రత్యేక పూజలు





**ములకలపల్లి సెప్టెంబర్ 21 (ప్రజాజ్యోతి):** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు సోమవారం ములకలపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. సంజీవ్ పల్లి, పూసుగూడెం, ములకలపల్లి ఆంజనేయస్వామి ఆలయం, గుల్లగూ డెం, కంపగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాలు గ్రామాల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తాటి వెంకటేశ్వర్లును శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువత, గ్రామస్తులతో ఆయన ముచ్చటించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ తనం పద్మ, మాజీ సర్పంచ్ వాడే నాగరాజు, రాజేష్, శనగపాటి సీతారాములు, బండి కొమురయ్య, సునీల్‌కుమార్, కొండవీటి చంద్రశేఖర్, పుష్పల హన్మంత్, పుష్పల సాయి, నరటి రమేష్, అనుమల సాయి, ఇమానియేల్, బొర్ర సుధాకర్, సడియం నరసింహారావు, సడియం అశోక్, సోడే శ్రీనివాస్, సడియం శ్రీను, బొర్ర మోహన్, సడియం ప్రసాద్, సడియం ప్రవీణ్, సడియం కళ్యాణ్, భూక్య నందా, కణితి వినోద్, ఊకే కిరణ్, ఊకే నవీన్, ఊకే గణేష్, ఊకే రాజేంద్ర, సున్నం రాజకుమార్, ఊకే మోటు, ఊకే కిరణ్‌బాబు తదితరులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మణుగూరులో చెక్కు బౌన్స్ తీర్పు...

- చోడవరం వ్యక్తికి పరిహారంతో ఆరు నెలల జైలు...
- రూ.8 లక్షల అప్పు తీర్చకపోవడంతో కోర్టు సీరియస్..!
- 2017లో ఇచ్చిన చెక్కు బౌన్స్..! 9 ఏళ్ల తర్వాత తీర్పు చెప్పిన మణుగూరు కోర్టు...
- సరిపడా బ్యాలెన్స్ లేక బౌన్స్ అయిన చెక్కు..!! న్యాయం దక్కించుకున్న మణుగూరు వ్యాపారి...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. సెప్టెంబర్ 21, ప్రజా జ్యోతి :** అప్పు తీసుకుని తిరిగి ఇవ్వకుండా ఇచ్చిన చెక్కు బౌన్స్ అయిన కేసులో మణుగూరు కోర్టు సోమవారం సంచలన తీర్పు ఇచ్చింది. చెక్కు బౌన్స్ కేసులో దోషిగా తేలిన ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.8 లక్షల పరిహారం చెల్లించాలని మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం.. చోడవరం ప్రాంతానికి చెందిన బాలాజీ వర్మ అనే వ్యక్తి మణుగూరుకు చెందిన శ్రీనివాస్ వద్ద రూ.8 లక్షలు రుణంగా తీసుకున్నాడు. తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేందుకు 2017లో రూ.8 లక్షల విలువైన చెక్కును శ్రీనివాస్ కు ఇచ్చాడు. అయితే బ్యాంకులో సరిపడా నగదు లేకపోవడం తో ఆ చెక్కు బౌన్స్ అయింది. దీంతో బాధితుడు శ్రీనివాస్ న్యాయ నోటీసు పంపించగా, ముద్దాయి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. చేసేదేమీ లేక శ్రీనివాస్ మణుగూరు కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువైనట్లు నిర్ధారించి ఈ శిక్ష విధించారు. ఫిర్యాదుదారుడు శ్రీనివాస్ తరపున న్యాయవాదులు బొమ్మా రామకోటయ్య, అన్వేష్ యలమంచిలి వాదనలు వినిపించారు. కేసు గెలిపించినందుకు ఫిర్యాదుదారుడు న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక నవరాత్రి వేడుకల్లో తాటి వెంకటేశ్వర్లు

- గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే




**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 21, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని బొడ్రాయి సెంటర్, శివ బాలాజీ నగర్‌లో శాలివాహన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి వేడుకల్లో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం శాలివాహన ఉత్సవ కమిటీ, శివ బాలాజీ నగర్ ఉత్సవ కమిటీ సభ్యులు తాటి వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లకావత్ లక్ష్మీ, ఉప సర్పంచ్ మారగాని అశోక్, మాజీ ఎంపీటీసీ ఐలూరి కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి





(మొదటి పేజీ తరువాయి...)

వరకు పారదర్శకంగా ఉండేందుకు అధికారులు పనిచేయాలని ఆదేశించారు. భద్రాద్రి జిల్లాకు శ్రీ సీతారామ చంద్రస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు , అదేవిధంగా వివిధశాఖల అధికారుల నుంచి వివరాలు తోపాటు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నివేదిక రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లా పోలీస్ శాఖ నివేదికను కమిషన్ చైర్మన్ అడుగగా 2014 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 1115 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయాయని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వివరించారు. అందులో 51 కేసులు ప్రస్తు తం విచారణలో ఉన్నాయని, వాటిలో 20 కేసులో చార్జింగ్ చార్జిషీట్ చేశామని, రెండు హైకోర్టు స్టేలు ఉండగా, 9 కేసులు లీగల్ ఒపీనియన్ కోసం ఉన్నాయని, 20 పెండింగ్ కేసులు ప్రస్తుతం ఉన్నట్లు జిల్ల్ ఎస్పీ వివరించారు. ఈ క్రమంలోనే జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ, జిల్లా పంచాయతీ, డీ.ఆర్.డీ.ఓ, ఎస్సీ కార్పొరేషన్, గురుకులాల, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా ప్రజా పరిషత్, ఉపాధి శాఖ మున్సిపల్ శాఖ, వ్యవసాయ శాఖ, పరిశ్రమలు, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి, ఎక్సైజ్ జ్యోతిరావు పూలే డిసిఓ, జిల్లా రెవెన్యూ, ఫారెస్ట్, ఐటీడీఏలో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల వివరాలు ఉద్యోగుల సమస్యలు ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల సంఖ్య భర్తీ కానీ బ్యాక్లాగ్ పోస్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ ల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వారి అభ్యున్నతే లక్ష్యంగా వివిధ పథకాల అమలుకు కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల తాహసిల్దార్లు, ఎంపీడీవోలు, సిడిపివోలు సమన్వయంతో జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ల సమస్యల పరిష్కారానికి న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితుల కోసం పని చేయాలని ఆదేశించారు. భద్రాద్రి గిరి మార్ట్ ఏర్పాటు ఆదర్శంనీయమని కమిషన్ చైర్మన్ భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ ను అభినందించారు. గిరిజన మహిళా సంఘాల ఆధ్వర్యంలో వారి సాంప్రదాయ వృత్తి ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా భద్రాచలంలో ఈ గిరిమార్టును ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. వారి ఉత్పత్తులు ను ఏర్పాటు చేసి, గిరిజనుల జీవనశైలి విధి, విధానాలను కళ్ళకు కట్టే విధంగా చూపించిన మ్యూజియం అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. అనంతరం న్యాయం కోసం వచ్చిన ఎస్సీ, ఎస్టీ బాధితుల నుంచి కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, నీలాదేవి, డీ.బీ.ఎఫ్ శంకర్ లతో కమిషన్ చైర్మన్ వెంకటయ్య దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు రిఫర్ చేసి ఎటువంటి నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించకుండా తక్షణమే సమస్యలు పరిష్కారం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తొలుత రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు భద్రాద్రి పోలీస్, ఏ.ఆర్ విభాగాల ఆధ్వర్యంలో గాడ్ ఆఫ్ హనర్ ఏర్పాటు చేసి ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వేణుగోపాల్, భద్రాచలం ఐటిడిఏ పి.ఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీ. ఆర్.ఓ పద్మావతి, సిపిఓ సునీత, జిల్లా షెడ్యూలు కులముల అధికారిని శ్రీలత, కార్పొరేషన్ ఈ.డీ ఉపేందర్, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీపీఓ అనూష, డీ.ఏ.వో బాబురావు, విద్యుత్ శాఖ ఈ వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టెండర్ దక్కించుకొని, గార్డుల ప్రాణాలతో చెలగాటమా..?

- 190 మంది గార్డులకు శిక్షే..! మూడు నెలలుగా సెక్యూరిటీ సామగ్రి లేదు...
- చీకట్లో వణుకుతున్న సెక్యూరిటీ గార్డులు...
- సింగరేణి సెక్యూరిటీ అధికారుల తీరుపై అనుమానాలు...
- సింగరేణి కాంట్రాక్టర్ పై చర్యలు ఎప్పుడూ..?




**మణుగూరు క్రైమ్, సెప్టెంబర్ 21 ప్రజాజ్యోతి :** సింగరేణి మణుగూరు ఏరియాలో 190 మంది ప్రాణాలతో సదరు కాంట్రాక్టర్ చెలగాటమాడుతున్నారు. బొగ్గు బావులు, కీలక కార్యాలయాలు, అధికారుల కాలనీలకు కాపలా ఉండే సెక్యూరిటీ గార్డుల నెత్తినే చేతులెత్తేస్తున్న దుస్థితి నెలకొంది. నూతన టెండర్ దక్కించుకుని మూడు నెలలు గడిచినా, గార్డులకు ఇవ్వాల్సిన కనీస సామగ్రి ఇవ్వకుండా శ్రీ సాయిరాం సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ చేతులెత్తేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్ నిబంధనల ప్రకారం ప్రతి గార్డుకు యూనిఫామ్, బూట్లు, లాఠీ, టార్చ్‌లైట్, వాటర్ బాటిల్, రైన్‌కోట్, విజిల్ ఇవ్వాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. పాత, చిరిగిపోయిన బట్టలతో, చెప్పులతోనే సెక్యూరిటీ గార్డులు డ్యూటీ చేస్తున్నారు. వర్షంలో రైన్‌కోట్ లేక , తడిసి ముద్దయ్యి వణుకుతూనే విధులు నిర్వహిస్తున్నారు. చీకటి రాత్రుల్లో టార్చ్‌లైట్ లేక, చేతిలో లాఠీ కూడా లేకుండా గస్తీ తిరగాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది.

**నిబంధనలు కాగితాలకే పరిమితమా..!!అధికారుల పర్యవేక్షణ ఏదీ..?**

టెండర్ ఇచ్చిన తర్వాత కాంట్రాక్టర్ ఏం చేస్తున్నాడో చూడాల్సిన బాధ్యత సింగరేణి సెక్యూరిటీ అధికారులది కాదా..? మూడు నెలలుగా సామగ్రి ఇవ్వకపోయినా అధికారులు ఎందుకు నోరు మెదపడం లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రికార్డుల్లో సామగ్రి ఇచ్చినట్లు బిల్లులు పెట్టుకుని, క్షేత్రంలో మాత్రం గార్డులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా సొమ్ము చేసుకుంటున్నారా..? అనే కోణంలో విచారణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుస్తోంది. సింగరేణి ఆస్తులకు రక్షణ కల్పించే గార్డులకే రక్షణ లేకపోతే, ఇక సింగరేణి భద్రత ఎలా ఉండబోతుందో అర్థం చేసుకోవచ్చని పలువురు చర్చించుకోవడం చర్చనీయంశంగా మారింది. టెండర్ తీసుకుని లాభాలు దండుకుంటూ, కార్మికుల చెమటను దోచుకునే ఈ తీరుపై సింగరేణి ఉన్నత యాజమాన్యం వెంటనే స్పందించి సంబంధిత కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవడంతో పాటు, బాధ్యత విస్మరించిన అధికారులపై కూడా విచారణ జరపాలని కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నారు.